ఆంధ్రజ్యోతి



పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి డీఆర్‌వో భవానీశంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు.



శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి హారతిస్తున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆలయాల్లో మంత్రి ఆనం ప్రత్యేక పూజలు

సింహాద్రి అప్పన్న స్వామి, శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న రామనారాయణరెడ్డి

పూర్ణకుంభాలతో ఘనంగా స్వాగతం పలికిన దేవస్థానం అధికారులు

కోర్టు అనుమతితో పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం: దేవదాయ శాఖా మంత్రి

-వార్త 6వ పేజీలో...

దేవదాయశాఖ అధికారులతో మంత్రి 'ఆనం' సమీక్ష

సింహాచలం భూములు, పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారంపై చర్చ

రుషికొండ భవనాలను మానసిక ఆస్పత్రిగా మార్చాలన్న పూసపాటి అశోక్‌గజపతిరాజు

-వార్త 6వ పేజీలో...



ఉత్సాహంగా నేవీ మారథాన్

వివిధ విభాగాల్లో 15 వేల మంది హాజరు

బీచ్ రోడ్డులో నిర్వహించిన నేవీ మారథాన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు. (ఇన్‌సెట్లో) జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్ పెంధార్కర్



భారత నౌకాదళం ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలోని బీచ్ రోడ్డులో నిర్వహించిన మారథాన్ ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. నేవీ మారథాన్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, తూర్పు నావికాదళ ప్రధాన అధికారి రాజేశ్ పెంధార్కర్, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీలు జెండా ఊపి ప్రారంభించారు...వార్త 6లో

నగరంలో వనం

కంబాలకొండ, సాగర్‌నగర్ తీరంలో ఏర్పాటుకు యోచన



కంబాలకొండ ప్రవేశ ద్వారం

- రూ. 2 కోట్లతో ప్రతిపాదన
- ఇప్పటికే రూ. 1.4 కోట్లు విడుదల
- నగరవాసులకు ఆనందం, ఆహ్లాదం అందించడమే ముఖ్య ఉద్దేశం

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)

ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు నగర వాసులది ఉరుకు పరుగుల జీవనం. అందుకే వారమంతా అలసిపోయిన ఉద్యోగులు వీకెండ్ కోసం ఎదురు చూస్తుంటారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు నగరంలో చాలా పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ అటవీ ప్రాంతం మాత్రం కాస్తా దూరమనే చెప్పాలి. నగర ప్రజలు అటవీ ప్రాంతానికి (ఏజెన్సీ) వెళ్లాలంటే సుమారు వంద కి.మీ. ప్రయాణించాలి. అడవిలో పర్యటించిన వారికి కొత్త అనుభూతులు ఎదురవుతాయి. అటువంటి అనుభవాలను నగరవాసుల చెంతకు చేర్చేందుకు ప్రభుత్వం కొత్త ప్రతిపాదన చేస్తోంది.

ఏజెన్సీకి వెళ్లే అవసరం లేకుండా నగరంలో విశాలమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ అడవిలో ఉన్నటువంటి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. ఈ మేరకు నగరంలో కంబాలకొండతో పాటు సాగర్‌నగర్ తీరంలో వనం ఏర్పాటుకు అటవీ శాఖ యోచిస్తోంది. కంబాలకొండలో ఇప్పటికే ఏకో టూరిజం పార్కు ఉంది. సందర్శకుల కోసం బోట్ షికారు, ట్రెక్కింగ్, ఇతర సదుపాయాలు ఉన్నాయి. అయితే కంబాలకొండలో 50 హెక్టార్లలో నగర వనం ఏర్పాటు చేయడం వల్ల టూరిజం అభివృద్ధితో పాటు అడవి తరహాలో అభివృద్ధి చేయాలని రూ. రెండు కోట్లతో ప్రతిపాదించారు. ఇప్పటికే రూ. 1.4 కోట్లు నిధులు విడుదల చేశారు. నగర ప్రజలకు ఆనందం, ఆహ్లాదం కలిగించడమే నగర వనం ప్రధాన ఉద్దేశమని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబం ... మిగతా 6వ పేజీలో

మాజీ ఎంపీ ఎంవీవీ దందా

అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతి ఒకచోట.. నిర్మాణం మరోచోట

- దీనిపై జీవీఎంసీకి ఫిర్యాదు అందినా పట్టించుకోని అధికారులు
- విసిగిపోయి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన ఫిర్యాదుదారుడు
- పరిశీలించి 30 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్‌కు హైకోర్టు ఆదేశం
- ప్లాన్ కోసం ఎంవీవీ సమర్పించిన పత్రాలపై విచారణ చేపట్టిన అధికారులు
- ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకోవాలని నిర్ణయం



ఎంవీవీ సత్యనారాయణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల దందాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఊహలకు అందని విధంగా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ బక్కన్నపాలెంలో అపార్టుమెంట్ నిర్మాణానికి జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకుని మరోచోట భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై ఒకరు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికార పార్టీకి చెందిన ఎంపీ కావడంతో పట్టించుకోలేదు సరికదా అక్రమ భవనానికి అండగా నిలిచారు. చివరకు హైకోర్టులో ఆ వ్యక్తి పిల్ వేయడంతో కోర్టు ఆదేశాల మేరకు అధికారులు విచారణ జరిపి, అక్రమాలు వాస్తవమేనని నిర్ధారించడం చర్చనీయాంశంగా మారింది.



మధురవాడలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్

మధురవాడ సర్వే నంబర్-2లోని పట్టా నంబర్ 595లో (బక్కన్నపాలెం) 2,829 చదరపు మీటర్ల స్థలంలో జీ+5 భవన నిర్మాణం కోసం ఎంవీవీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ పేరుతో మాజీ ఎంపీ ఎంవీవీ జీవీఎంసీకి 2021లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుతో పాటు జత చేసిన పత్రాలను టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి 2022లో భవన నిర్మాణానికి (బీఏ నంబర్-1086/7069/బీ/జెడ్2/కేడీఐ2021) అనుమతులు జారీ చేశారు. దీంతో అపార్టుమెంట్ నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఇదిలావుండగా ఎంవీవీ సత్యనారాయణ సర్వే నంబర్-2లోని పట్టా నంబర్-595లో అపార్టుమెంట్ నిర్మాణానికి అనుమతి తీసుకుని పట్టా నంబర్-585లో నిర్మాణం ప్రారంభించడంతో పసుపుల మహేశ్ అనే వ్యక్తి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ భవన నిర్మాణానికి మాజీ ఎంపీ జీవీఎంసీకి సమర్పించిన పత్రాలను పరిశీలించి, తక్షణమే నిర్మాణ పనులు నిలిపివేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో పలుమార్లు ఇదే అంశంపై ఆయన ఫిర్యాదు చేశారు. అయినా వారి నుంచి స్పందన కొరవడడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో మహేశ్ హైకోర్టులో పిల్ ... మిగతా 6వ పేజీలో

ఏయూకు అడ్వయిజరీ బోర్డు?

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మంత్రి నారా లోకేశ్ ప్రకటన

- వర్సిటీకి పూర్వ విద్యార్థులను అనుసంధానం చేసేందుకేనని వెల్లడి
- అభివృద్ధికి సహకారం తీసుకోవడంతోపాటు సలహాలు, సూచనలు తీసుకునే యోచన
- అంతర్జాతీయ స్థాయిలో నిలపడమే లక్ష్యం
- ఏయూ అధికారులు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులతో త్వరలో మంత్రి సమావేశం
- ఏయూకు సంబంధించి కొద్దిరోజుల్లో కీలకమైన ప్రకటన వస్తుందన్న వ్యాఖ్యలపై సర్వత్రా ఆసక్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. 2026 నాటికి వందేళ్లు పూర్తి చేసుకోబోతున్న ఏయూ అంతర్జాతీయ స్థాయిలో టాప్-100లో నిలిచేలా చేస్తామని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చెప్పిన ఆయన...ఈ సందర్భంగా చేసిన మరో ప్రకటనపై వర్సిటీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. అదే అడ్వయిజరీ బోర్డు ఏర్పాటు...పూర్వ విద్యార్థుల అసోసియేషన్ వ్యవస్థాపకులైన జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావుతో చర్చించి యూనివర్సిటీ అభివృద్ధికి, పూర్వ విద్యార్థులను కనెక్ట్ చేసేందుకు అడ్వయిజరీ బోర్డు ఏర్పాటుచేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు.

వర్సిటీ ప్రగతికి పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకోవడంతోపాటు నిరంతరం సలహాలు, సూచనలు ఇచ్చేలా దీనిని ఏర్పాటుచేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జాతీయ వర్సిటీలకు ఈ తరహా బోర్డులు ఉంటాయని, అటువంటి ఆలోచనలోనే



ప్రభుత్వం ఉన్నట్టుందంటు న్నారు. అందులో భాగంగానే మంత్రి పూర్వ విద్యార్థుల సమావేశం వేదికగా ఈ ప్రకటన చేశారని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆయన కొద్దిరోజుల్లో ఏయూ అధికారులు, పూర్వ విద్యార్థులైన ప్రముఖుల (అసోసియేషన్ ప్రతినిధులు)తో మరో సమావేశాన్ని నిర్వహించవచ్చునంటున్నారు.

ఏయూలో చదువుకున్న సుమారు రెండు నుంచి మూడు లక్షల మంది పూర్వ ... మిగతా 6వ పేజీలో

హెల్త్ అసిస్టెంట్లకు ఉద్వాసన

- ఆరోగ్య శాఖలో 170 మంది తొలగింపు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 20 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు
- కొవిడ్ సమయంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు ఎందరో..
- ఉద్యోగాలు తీసేసి తమను రోడ్డున పడేశారని ఆవేదన



విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

ఆరోగ్య శాఖలో గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు వివాదాస్పదంగా మారుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 1,200 మందిని తొలగించగా, ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారు 170 మంది ఉన్నారు. తమను తొలగించడానికి నియామక ప్రక్రియలో ప్రభుత్వం అనుసరించిన విధానమే కారణమని వారు చెబుతున్నారు. అనర్హులైన కొందరు ఉద్యోగాల్లో చేరడంతో అప్పట్లో అర్హులైనప్పటికీ ఉద్యోగాలు దక్కించుకోలేని పలువురు 2013లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘకాలం పాటు విచారణ జరిగాక కొద్ది రోజులు కిందట తెలంగాణ హైకోర్టు తీర్పు ... మిగతా 6వ పేజీలో

యూపీ పాఠశాలలు ఎత్తివేత!

- విద్యార్థులు తక్కువగా ఉన్నచోట సబ్జెక్టు టీచర్లు వెనక్కి.
- అంధకారంలో ఆరేడు తరగతుల పిల్లల భవిష్యత్తు

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):

ఆరేడు తరగతుల పిల్లలు 30 మంది కంటే తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా కుదించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. పాఠశాల విద్యలో ప్రస్తుతం ఉన్న ఆరు రకాల పాఠశాలలను నాలుగుకి తగ్గించనున్నారు. దీంతో రెండేళ్ల క్రితం ప్రారంభించిన హైస్కూళ్ల ప్లస్‌లను రద్దు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ



పద్మనాభం మండలంలోని కొత్త కొవ్వాడ యూపీ పాఠశాల

నేపథ్యంలో విశాఖ జిల్లాలో 16 ప్రాథమికోన్నత పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి ఆరేడు తరగతులను రద్దు చేసి సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేస్తారని ఉపాధ్యాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విశాఖ జిల్లాలో 34 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. యూపీ పాఠశాలల్లో ఆరేడు తరగతుల పిల్లలు వంద మంది కంటే ఎక్కువగా ఉన్న పాఠశాలలు కేవలం నాలుగే ఉన్నాయి. అత్యధికంగా నగరంలో ... మిగతా 6వ పేజీలో

బేబీ కిట్లు వచ్చేస్తున్నాయ్..

- నవజాత శిశువులకు బేబీ కిట్లు అందించే యోచనలో ప్రభుత్వం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక పథకానికి తిలోదకాలు
- ఇప్పుడు కూటమి సర్కారు హయాంలో పునరుద్ధరణకు చర్యలు
- కిట్‌లో సుమారు రూ.వెయ్యి విలువైన వస్తువులు

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):

నవజాత శిశువులకు రక్షణ కల్పించి, శిశు మరణాలను తగ్గిం చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బేబీ కిట్లు అందజేయాలని యోచిస్తోంది. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో



బేబీ కిట్లు అందజేస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

అప్పుడే పుట్టిన బిడ్డల కోసం శిశు సురక్ష యోజన పేరుతో ప్రత్యేక పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం కింద నవజాత శిశువుల ఆరోగ్యానికి మేలు చేకూర్చే కొన్ని రకాల వస్తువులతో కూడిన బ్యాగులను ప్రభుత్వం బాలింతలకు అందించేది. దీనివల్ల శిశువులకు ఎంతో మేలు చేకూరేది. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని చూపింది. మొదట్లో ... మిగతా 6వ పేజీలో

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దయాళ్‌నగర్‌లో ఉన్న దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో (డీఈఐ) వృత్తి విద్యా కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ సెంటర్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పాసైన వారు వయస్సుతో సంబంధం లేకుండా శిక్షణలో చేరవచ్చునని చెప్పారు. సెల్ ఫోన్ రిపేరింగ్, డ్రెస్ డిజైనింగ్, టైలరింగ్, టెక్స్ టైల్ డిజైనింగ్, ప్రింటింగ్, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్, ఇతర వృత్తి విద్యా కోర్సులకు మూడు నెలలు పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 31వ తేదీ లోపు డీఈఐ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9963340611 నంబరును సంప్రతించాలని సూచించారు.

ఘనంగా దత్త జయంతి

ఆనందపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాల ఆవరణలో ఉన్న దత్తాత్రేయ ఆలయంలో దత్త జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమై సాయంత్రం దత్త హోమంతో కార్యక్రమాన్ని ముగించారు. ముందుగా గాయత్రీ నవ చక్ర సహిత అమ్మవారికి పూజలు, రుద్రాభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ సహనం, భక్తి తత్పరత ప్రతిఒక్కరూ అలవర్చుకుని, మంచి మార్గంలో నడవాలన్నారు. అనంతరం విశాఖ కంచి కామకోటి ఆస్థాన వేద ఘనాపాటి కందుకూరి పురుషోత్తం వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన విహార సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మహా సన్నిదాన పూజ

భీమునిపట్నం,డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్డులో ఉన్న అయ్యప్ప దేవాలయంలో సోమవారం మహా సన్నిదాన పూజ జరగనుంది. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయ్యప్పస్వాములు, భవానీ భక్తులు ఈ పూజలో పాల్గొనున్నట్టు హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు షన్ముఖరావు, బద్రీనారాయణ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని నిరసన

ఆనందపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై మానవహారం చేపట్టి గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. విగ్రహాలకు అవమానాలు, ఘోరాలు జరుగుతున్నా.. ప్రభుత్వాలు నామమాత్రంగా స్పందిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 140 కోట్ల మంది జనాభా అనుసరిస్తున్న రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు విగ్రహాల వద్ద నిఘా ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, దళిత నాయకులు బోని సన్నిబాబు, సియాంద్రి రాంబాబు, ఉప్పాడ సత్యన్నారాయణ, మల్లరపు కృష్ణ, రామారావు, బోని నరసింగరావు పాల్గొన్నారు.

యూపీ పాఠశాలలు ఎత్తివేత!

... 5వ పేజీ తరువాయి

ఆర్‌బీఎంయూపీ స్కూల్‌లో ఆరు, ఏడు తరగతుల పిల్లలు 194 మంది ఉన్నారు. 50 నుంచి 100 మంది ఉన్న పాఠశాలలు ఐదు, 31 నుంచి 49 మంది ఉన్న పాఠశాలలు ఆరు ఉన్నాయి. కాగా ఐదు నుంచి 30 మంది విద్యార్థులున్న స్కూళ్లు 16 ఉన్నాయి. 30 మంది కంటే తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఆరేడు తరగతులకు పాఠాలు బోధించే సబ్జెక్టు టీచర్లు లేరు. ఈ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయగా అక్కడ ఎస్జీటీలు బోధన చేస్తున్నారు. యూపీ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరడానికి విద్యార్థులు విముఖత చూపడానికి విద్యాశాఖ విధానాలే కారణమన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవస్థను కూనరిల్లేలా అధికారులు యూపీ పాఠశాలలకు తూట్లు పొడిచారు. సబ్జెక్టు టీచర్లను అందుబాటులోకి తీసుకురాకపోవడం, ఒకవేళ ఉన్నా ఒకటి లేదా రెండు సబ్జెక్టులకు పరిమితం చేస్తుండంతో పిల్లలను అక్కడ చేర్పించడానికి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్నప్పుడు వారిలో పోటీతత్వం ఉండదనే భావన వారిలో ఉంది. కాస్త స్తోమత ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు.

ఆరేడు తరగతుల విద్యార్థులు అతి తక్కువగా ఉన్న పాఠశాలలు..

- పెదగంట్యాడ మండలం పిట్టవానిపాలెంలో ఆరో తరగతిలో కేవలం ఆరుగురు విద్యార్థులే ఉండగా ఏడోతరగతిలో ఒక్కరు కూడా లేరు. భీమునిపట్నం మండలం పెద నాగమయ్య పాలెంలో ఏడుగురు, కృష్ణరాజుపేటలో 10 మంది, చిన్ననాగమయ్యపాలెంలో 11 మంది, ఆనందపురం మండలం దబ్బంద, వేములవలసల్లో 13 మంది చొప్పున ఉన్నారు.
- పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ, ఆనందపురంలోని పాలవలసలో రెండు తరగతులకు కలిపి 14 మంది వంతున ఉన్నారు. భీమిలిలోని మూలకుద్దులో 15 మంది, అన్నవరంతో పాటు పెందుర్తి పరిధిలోని పెదగాడిలో 16 మంది మాత్రమే ఉన్నారు.

త్వరలో 'పంచ గ్రామాల' సమస్య పరిష్కారం

- కొలిక్కివచ్చిన అంశం
- అందరికీ ఆమోదయోగ్యం పరిష్కారం
- రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



కప్ప స్తంభం వద్ద మంత్రి రామనారాయణరెడ్డి

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూసమస్యకు కోర్టు అనుమతితో త్వరలోనే పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన అప్పన్నస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నగరానికి చెందిన కూటమి ఎమ్మెల్యేలు పంచ గ్రామాల భూ సమస్య గురించి ప్రస్తావించారని చెప్పారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అశోక్ గజపతి రాజుతో సమావేశమైనట్టు తెలిపారు.426 ఎకరాల దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిలో 12,149 మంది ఇళ్లు నిర్మించుకున్నట్టు అధికారులు ధ్రువీకరించారన్నారు. అందుకు సంబంధించిన నష్టపరిహారాన్ని, ప్రత్యామ్నాయ భూములను ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. దీనికి అశోక్ గజపతిరాజు సానుకూలంగా స్పందిస్తూ కొన్ని సూచనలు చేసినట్టు చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వానికి కొంత నష్టం, క్షేత్రానికి మేలు జరుగుతుందని, అదే సమయంలో కొందరు ప్రజలు ఇబ్బంది పడవలసి వస్తుందన్నారు. సమావేశం వివరాలను సీఎంకు అందజేసి,అనంతరం కోర్టుకు సమర్పిస్తామన్నారు. దేవాలయాల్లో వైదిక సంప్రదాయాలు కొనసాగించేందుకు అవసరమైన ఖాళీ పోస్టుల భర్తీకి కార్యాచరణ రూపొందిస్తున్నామని, వేద అధ్యయనం చేసిన వారితో నియామకాలు చేపట్టడంతో పాటు, కైంకర్యపరులు, ఇతర లౌకిక పోస్టుల భర్తీని సీఎం ఆదేశాలతో ప్రకటిస్తామన్నారు. కాగా మంత్రికి ఆలయ ఆచారం ప్రకారం ఈఓ వేంద్ర త్రినాథరావు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం పూర్ణ కుంభంతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత ఆలయ పండితులు చతుర్వేద ఆశీస్సులీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి

విశాఖపట్నం : భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రి రామనారాయణరెడ్డి కనకమహాలక్ష్మి ఆలయ ఈవో శోభారాణిని ఆదేశించారు. మంత్రి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం సందర్శించగా అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఆలయ సంప్రదాయం ప్రకారం వేద పండితులు మంత్రి చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఈవో కె. శోభారాణి భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను మంత్రికి వివరించగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎన్. సుజాత, టీడీపీ దక్షిణ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

దేవదాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆ శాఖ అధికారులతో నగరంలోని తాజ్ హోటల్లో ఆదివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై ఆయన సమీక్షించారు. ముఖ్యంగా సింహాచలం భూములు, మాన్సాస్ ట్రస్టు భూములకు సంబంధించిన సమస్యలు, పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి సంబంధించి ఉన్న ఇబ్బందుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇతర దేవాయాలయాల నిర్వహణపైనా చర్చించారు. ఈ సమావేశంలో సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో అశోక్‌గజపతిరాజు మాట్లాడారు. సింహాచలం, మాన్సాస్ భూముల సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. వీలైనంత త్వరగా ఈ సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపించేందుకు యత్నిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే రుషికొండ భవన నిర్మాణాలను చేపట్టారని, ఇదొక పిచ్చిపనిగా ఆయన అభివర్ణించారు. రుషికొండ భవనాలను మానసిక ఆస్పత్రిగా మార్చితే మంచిదని వ్యాఖ్యానించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనంతా సైకో పాలనగా సాగిందని విమర్శించారు. రుషికొండ కట్టడాలను ఏం చేయాలనే అంశంపై ప్రజాభిప్రాయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు సచివాలయాన్ని కట్టారని, జగన్మోహన్‌రెడ్డి దానిని రూ.375 కోట్లకు తాకట్టు పెట్టాడని ఆరోపించారు. ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టే అధికారం ఎవరిచ్చారని అశోక్‌గజపతిరాజు ప్రశ్నించారు.



కొమ్మాది : కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్ కుమార్



ఎండాడ : పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

వర్ధంతి సభల్లో డీఈఓ ప్రేమ్ కుమార్, డీఎస్పీ నాగేశ్వరరావు

కొమ్మాది, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన గొప్ప పోరాట యోధుడు పొట్టి శ్రీరాములు అని డీఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పొట్టి శ్రీరాములు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలు కోల్పోయే వరకు పోరాటం చేసిన గొప్ప నాయకుడు శ్రీరాములు అనికొనియాడారు.ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినంగా పాటించడం ప్రభుత్వం ఆయనకు ఇచ్చిన గౌరవం అని చెప్పారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతకముందు పలువురు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు మరవలేనివని, ఆయన పోరాట పటిమను సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేశారని గుర్తు చేశారు. ఆయన త్యాగాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికీ మరవరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, సంజీవరావు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో ఎండాడ విద్యార్థుల ప్రతిభ



ఎండాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఎండాడకు చెందిన స్కైలైన్ అపార్ట్‌మెంట్స్ బాలలు ప్రతిభ చూపారు. ఈనెల 5 నుంచి 15 వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి.వీటిలో 11 నుంచి 14 ఏళ్లలోపు కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్టిస్టిక్ విభాగంలో ప్రాతినిధ్యం వహించిన సాయి సంహిత, సాయి హితేష్, శ్రీసాహితీ ఒక బంగారు, ఐదు రజిత పతకాలు సాధించారు.అలానే వచ్చే ఏడాది దక్షిణ కొరియాలో జరిగే ఆసియన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందారు. ఈమేరకు కోచ్ ఆకుల పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కరాటే పోటీల్లో భీమిలి క్రీడాకారులకు పతకాలు

భీమునిపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డుకు చెందిన క్రీడాకారులు విశాఖ పోర్టు ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో పలు పతకాలు సాధించారు. బాలికల విభాగంలో 8 ఏళ్ల కేటగిరీలో వి. నివేదిక బంగారు పతకం, 12 ఏళ్ల విభాగంలో వి. భారతి సిల్వర్ మెడల్ పొందారు. బాలుర విభాగంలో పదేళ్ల విభాగంలో ఎం. జానేష్ సిల్వర్ మెడల్, 12 ఏళ్ల కేటగిరీలో ఎం. ధనుశ్ బ్రాంజ్ మెడల్ పొందారని కోచ్ వి. శ్రీహరి తెలిపారు.

ఘనంగా బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అడివివరం ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ స్థాపన ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవం పురస్కరించుకుని మూడు రోజులుగా జరుగుతున్న విశేష హోమాలు మహా పూర్ణాహుతితో పూర్తయ్యాయి. ఈఓ వేంద్ర త్రినాథరావు సతీసమేతంగా అమ్మవారికి పూజలు చేయగా వేద పండితులు కొళ్లకూరి సుబ్రహ్మణ్యశర్మ, సంతోష్‌శర్మ సారథ్యంలో వైదికులు ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నూతన రాతి విగ్రహానికి, పోతురాజు విగ్రహానికి పూజలు జరిపారు. తరువాత నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, మాజీ సర్పంచులు వెంకటరమణ, పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

బేబీ కిట్లు వచ్చేస్తున్నాయ్..

... 5వ పేజీ తరువాయి

అరకొరగా అమలు చేసినా.. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ఈ పథకానికి తిలోదకాలిచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో మళ్లీ ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే జిల్లాల వారీగా నెలవారీ అయ్యే ప్రసవాలు, అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయ్యే ప్రసవాలు వంటి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల నుంచి తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే గర్భిణులకు మాత్రమే ఈ కిట్లను అందించనున్నారు.

కిట్‌లో ఉండే వస్తువులు

కిట్‌లో సుమారు వెయ్యి రూపాయలకు పైగా విలువైన కొన్ని వస్తువులు ఉంటాయి. మస్కిటో నెట్, శానిటైజర్, బేబీ బెడ్ కమ్ క్యారియర్, కొన్ని రకాల క్రీములు, పౌడర్ వంటివి ఉంటాయి. ఇవి బయట కొనుగోలు చేస్తే కనీసం రెండు వేల రూపాయల వరకు ఉంటుంది. ప్రభుత్వం వీటిని బల్క్‌గా కొనుగోలు చేసి ఉచితంగా అందించనున్నది. కొద్దిరోజుల్లోనే దీనిని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల నిరుపేదలకు ఎంతో మేలు చేకూరుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, ఏజెన్సీలోని ఆస్పత్రులు, కేజీహెచ్, ఘోషా వంటి ఆస్పత్రుల్లో ప్రసవించే గర్భిణుల్లో చాలామంది వీటిని కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతుంటారు. కనీస అవసరాలైన వీటిని అందించకపోవడం వల్ల చిన్నారులు కొన్ని రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారని ప్రభుత్వం భావిస్తోంది. అటువంటి వాటికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ కిట్‌లో మరికొన్ని వస్తువులను పెట్టే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

టీటీడీ ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

సాగర్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ వద్ద ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 10న జరగనున్న వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు వేకువజామున 3.30 నిమిషాలకు దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 6.40 నుంచి రాత్రి 10 వరకు దర్శనాలు జరుగుతాయని, భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని కొండపైకి మూడు బస్సు సర్వీసులు నడపనున్నట్టు వెల్లడించారు. దాతలకు, వీఐపీ దర్శనాలకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



స్వామివారి సన్నిధిలో సినీ నటి సంయుక్త మీనన్

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో విరూపాక్షి ఫేమ్ సంయుక్తా మీనన్, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారులు ఎంసీహెచ్ రామకృష్ణంరాజు, టి. నరేశ్ ఉన్నారు. వారికి ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న తరువాత అర్చకులు అంతరాలయంలో ప్రముఖుల గోత్రనామాలతో పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి



సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం సందడిగా కనిపించింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు హైదరాబాద్, చత్తీస్‌గఢ్, బెంగాళ్ తదితర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో బీచ్ కిటకిటలాడింది. చల్లని వాతావరణం, ఎగసిపడే కెరటాలను ఆస్వాదిస్తూ..ఇసుక తెన్నులపై ఆటలు ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. చలిని కూడా లెక్క చేయకుండా కేరింతలు కొడుతూ సముద్ర స్నానాలు ఆచరించారు.

సీతమ్మధార రైతు బజారులో చిల్లర నాణెలు పంపిణీ



నాణెలు పంపిణీ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చిల్లర నాణెల కొరతను దృష్టిలో పెట్టుకుని కనక మహలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో సీతమ్మధార రైతు బజారులో చిల్లర నాణెల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. స్థానిక రైతు బజారులోని రైతులకు వినియోగదారులకు 3.50 లక్షల రూపాయలు విలువైన 1 రూపాయి నుంచి 20 రూపాయల వరకు గల అన్ని చిల్లర నాణెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంలో చిల్లర నాణెలు పంపిణీ చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ ఆఫీసరు, బ్రాంచి మేనేజరు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మారథాన్‌లో యువత సందడి

ఉత్సాహంగా నేవీ మారథాన్

సాగర తీరంలో 15 వేల మంది దేశ, విదేశీయుల పరుగు

మహారాణిపేట (విశాఖపట్నం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో నేవీ మారథాన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. విశాఖ బీచ్‌లో తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన 9వ నేవీ మారథాన్‌ను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, తూర్పు నావికాదళ ప్రధాన అధికారి రాజేష్ పెంధర్కర్, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిలు జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌కే బీచ్‌లోని విష్ణుప్రియా ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభించిన మారథాన్‌లో దేశ, విదేశీయులు సుమారు 15 వేల మంది పాల్గొన్నారు. 42 కె, 21 కె, 10 కె, 5 కె లక్ష్యంగా యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పరుగు తీశారు. తెల్లవారుజామున సుమారు 4 గంటలకు 42 కె మారథాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద మారథాన్ విశాఖలో నిర్వహించటం శుభపరిణామమని, దీనివల్ల విశాఖలో ఉన్న పర్యాటక ప్రదేశాలు, సముద్రతీరం సహా అనేకం పర్యాటకాభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. సుమారు 8 దేశాలకు చెందిన రన్నర్సు పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా పరుగులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ నావల్ కమాండర్ రాజేష్, సమీర్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, పలువురు యువతీ యువకులు, నేవీ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఏయూకు అడ్వయిజరీ బోర్డు?

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. వీరిలో ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అటువంటి వారిని వర్సిటీకి కనెక్ట్ చేయడంతో పాటు అభివృద్ధికి వారి సహకారాన్ని తీసుకోవాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. పూర్వ విద్యార్థుల సహకారంతో వర్సిటీని అంతర్జాతీయ స్థాయిలోనిలబెట్టేందుకు ఈ అడ్వయిజరీ బోర్డును ఏర్పాటు చేస్తారని చెబుతున్నారు. ఈ బోర్డులో పూర్వ విద్యార్థులు, ఉన్నత విద్యాశాఖకు చెందిన అధికారులు, ఏయూ అధికారులు ఉండవచ్చునని భావిస్తున్నారు. వర్సిటీకి సంబంధించిన కీలక నిర్ణయాలు ఈ బోర్డులో తీసుకునే వెసులుబాటు కల్పిస్తారంటున్నారు. దీనిపై స్పష్టత రావడానికి కొంత సమయం పడుతుందని చెబుతున్నారు. ఏదిఏమైనా అడ్వయిజరీ బోర్డు గురించి స్వయంగా మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రే ప్రస్తావించడంతో ఈ విషయంపై ప్రస్తుతం వర్సిటీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

కీలక ప్రకటనపై ఆసక్తి

ఇదే సమావేశంలో మంత్రి మరో కీలకమైన వ్యాఖ్య చేశారు. కొద్దిరోజుల్లోనే వర్సిటీ సంబంధించి ముఖ్యమైన ప్రకటన వెలువడుతుందని వెల్లడించారు. అది ఏమై ఉంటుందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ వంటి అంశాలను ప్రస్తావించిన మంత్రి నారా లోకేష్..ఆ వెంటనే కీలక ప్రకటన త్వరలో వెలువడుతుందన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద విశ్వవిద్యాలయం కావడంతో ఏయూకు మంత్రి లోకేశ్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఉప యోగపడే ప్రకటన రావచ్చునన్న ఆశాభావాన్ని వర్సిటీ వర్గాలు వ్యక్తం చేస్తు న్నాయి. 'ఆ హబ్' పేరుతో ఇప్పటికే స్టార్టప్ సెంటర్, మరికొన్ని ఇంక్యుబేషన్ సెంటర్లు ఏయూలో ఉన్నాయి.ఈ తరహాలో మెగా సెంటర్ ఒకటి ఏర్పాటుచేసే ఆలోచనలో మంత్రి ఉన్నారని, దీనిని రాష్ట్రంలోని అన్ని సెం టర్లకు కేంద్రంగా ఏయూలో పెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు ఉద్వాసన

... 5వ పేజీ తరువాయి

వెలువరించింది. మంత్రివర్గ ఉప సంఘం మానవతా దృక్పథంతో ఉద్యోగాల్లోకి తీసుకున్న వారిని తొలగించాలంటూ సూచించింది. దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఆదేశాలను రాత్రికి రాత్రే అమలు చేసేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,200 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో పని చేస్తున్న 170 మంది ఉద్యోగాలను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో వారంతా తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలను కలిసి తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని కోరుతున్నారు. అప్పట్లో విధుల్లో చేరిన 1,200 మందిలో 220 మంది మాత్రమే మెరిట్‌లో లేకున్నా ఉద్యోగాలు పొందారని, మిగిలిన వారంతా నిబంధనల ప్రకారం విధుల్లో చేరారని పేర్కొంటున్నారు. 20 ఏళ్లుగా.. మరీ ముఖ్యంగా కరోనా వంటి విపత్కర సమయంలోనూ క్షేత్రస్థాయిలో పనిచేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడామని వారు పేర్కొంటున్నారు. కరోనా సమయంలో ఎంతోమంది కుటుంబ సభ్యులను కోల్పోయామని, ఇప్పుడు తమను ఉద్యోగాల నుంచి తొలగించి రోడ్డున పడేశారని వాపోతున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగం కోల్పోయిన శ్రీనివాస్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో విధుల్లోకి వెళ్లి, రావడం వల్ల వైరస్ బారినపడి కుటుంబ సభ్యులకు వ్యాప్తి చెందేందుకు కారణమయ్యాయని, ఆ సమయంలో తన భార్యతో పాటు అత్తామామలను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం వల్ల తాను కుటుంబాన్నే నష్టపోయానని, ఇప్పుడు ఉద్యోగం కూడా కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విచార వదనంతో తెలిపారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆలోచించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇలాంటి పరిస్థితినే ఎంతోమంది ఎదుర్కొంటున్నారని, వారంతా ప్రభుత్వ పెద్దల చుట్టూ తమను ఆదుకోవాలంటూ తిరుగుతున్నారన్నారు. మరి వీరిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

మాజీ ఎంపీ ఎంవీవీ దందా

... 5వ పేజీ తరువాయి

దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారుల వివరణ తీసుకోవడంతో పాటు పిటిషనర్‌ను, నిర్మాణ సంస్థను పిలిచి విచారించాలంటూ జీవీఎంసీ అధికారులకు హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చినగదిలి తహసీల్దార్‌తో పాటు పిటిషనర్‌ను, నిర్మాణసంస్థను రెండు నెలలు కిందట జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తన సమక్షంలో విచారణ జరిపారు. నిర్మాణం జరుగుతున్న స్థలం మధురవాడ సర్వే నంబర్-2లోని పట్టా నంబర్-585లో ఉన్నట్టు డిప్యూటీ తహసీల్దార్ నిర్ధారించారు. దీంతో ఈ నిర్మాణం అక్రమమని తేలడంతో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ అధికారులు దృష్టిసారించారు.

అధికారానికి దాసోహమైన టౌన్ ప్లానింగ్ అధికారులు!

ఎవరైనా భవన నిర్మాణానికి దరఖాస్తు చేస్తే దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో పొందుపరిచిన పత్రాలను పోస్ట్ వెరిఫికేషన్‌లో భాగంగా టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తారు. ఒకవేళ ప్రభుత్వ భూములను ఆనుకుని ఉన్న స్థలాలు, మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ప్రాంతంలోని స్థలాలు, నాలా కట్టని భూమిలో భారీ నిర్మాణాలు చేపట్టినట్టయితే టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ స్థలంపై సర్వేయర్ రిమార్క్ తీసుకున్న తర్వాతే ప్లాన్ జారీపై నిర్ణయం తీసుకుంటారు. అయితే మాజీ ఎంపీ భవన నిర్మాణం విషయంలో ఒక పట్టా నంబర్‌ను చూపించి మరో పట్టా నంబర్‌లోని స్థలంలో నిర్మాణం జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు కళ్లు మూసుకుని అనుమతులు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పట్టా నంబర్‌లో అనుమతి తీసుకుని వేరొకచోట అపార్టుమెంట్ నిర్మించేస్తున్నారని ఫిర్యాదు అందినప్పుడైనా సదరు అధికారులు కనీసం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పుడు హైకోర్టు ఆదేశంతో జీవీఎంసీ కమిషనర్ సమక్షంలో జరిగిన విచారణలో ఆ నిర్మాణం అక్రమమని నిర్ధారణ కావడంతో ఆ అపార్టుమెంట్‌కు ప్లాన్ జారీ చేసిన సమయంలోని సిబ్బంది, అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

నగరంలో వనం

... 5వ పేజీ తరువాయి

మొత్తం ఆనందంగా గడిపేలా చెట్ల కింద రచ్చబండలు, భూమికి ఐదారు అడుగుల ఎత్తులో వుడెన్ మంచాలు, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్, కాటేజీలు ఏర్పాటు చేస్తారు. కంబాలకొండలో ట్రెక్కింగ్ చేస్తున్న ప్రాంతంలో నగర వనం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఉదయం పూట వాకింగ్, సైక్లింగ్ చేసుకునేవారికి అనువుగా సదుపాయాలు కల్పిస్తారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లా కేంద్రాల్లో నగర వనాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. సాగర్‌నగర్ తీరానికి ఆనుకుని సరుగుడు మొక్కలతో షెల్టర్ బెల్ట్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో కూడా నగర వనం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. దీనిపై సర్వే చేసిన తరువాత నివేదిక రూపొందించనున్నారు.

తిరుమలనగర్‌లో స్వచ్ఛ భారత్



పార్కులను శుభ్రం చేస్తున్న కాలనీ వాసులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత వల్ల వ్యాధులు సోకే పరిస్థితి ఉండదని తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ పార్కుల్లో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకుడు గుంతలు, వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్ తదితర ప్రాంతాలలో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో పరమానందం, పరమేశ్వరరావు, మూర్తి, సన్యాసిరావు, వసంతరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రాష్ట్ర సాధు పరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



వెంకన్న సన్నిధిలో శ్రీనివాసానంద సరస్వతి

పెదగంట్యాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :హిందూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వాలతో పాటు ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర సాధుపరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతిస్వామి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామిని ఆదివారం ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ వెంకటేశ్వరాలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయని, నిర్మాణం పూర్తి అయితే ఈ ప్రాంతం ఆనందదామంగా మారగలదన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మిత్తని అప్పలరెడ్డి, పెంటకోట నాగేశ్వరరావు, ఆకుల అప్పలసూరి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :సర్దుబాటు పేరుతో పెంచి విద్యుత్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగ్గించి ప్రజలను ఆదుకోవాలని సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు అన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో కరెంట్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్



స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్థానికులకు సూచించారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని కండిపిల్లి వీధిలో కనకదుర్గ అమ్మవారి ఆలయ మండప నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. వార్డులో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. పెదగంట్యాడ మండల కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరగనుందని, దీనికి స్థానికులంతా హాజరై ఇళ్ల స్థలాలు, భూములకు సంబంధించిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, స్థానిక పెద్దలు తెప్పల దుర్యోధన, కండిపిల్లి సత్యనారాయణ, కడవల రమణ, లక్ష్మి, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి ఆలయ గిరిప్రదక్షిణ



ఆలయ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయకొండ గోవింద నామస్మరణలతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన గిరి ప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

'అమరజీవి' త్యాగం నిరుపమానం



పొట్టి శ్రీరాములకు నివాళి అర్పిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, గున్నేశ్వరరావు తదితరులు

అగనంపూడి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అగనంపూడి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి సంస్థ క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పాటులో పొట్టి శ్రీరాముల చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నేటి యువత ఆయన పట్టుదల ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వుడా సత్యనారాయణ, గున్నేశ్వరరావు, బి.సత్యనారాయణ, పుట్ట రమేశ్, గోవింద్, విందుల నారాయణరావు, చిన్నారావు, బీజీ. శెట్టి, స్వామి, గురునాథం పాల్గొన్నారు.



అమరజీవికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయాధికారి పీవీ రమణ, పాఠకులు

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ : ఆంధ్ర రాష్ట్ర విభజన కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం నిరుపమానమని పెదగంట్యాడ శాఖాగ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్రాసు నుంచి తెలుగు రాష్ట్రాన్ని విభజించాలని ఉద్యమించి నిరాహార దీక్షకు దిగి అశువులు బాసి రాష్ట్రాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాఠకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచండి

- టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జ్ నల్లూరు



రాజీవ్ నగర్ కాలనీలో సభ్యత్వ నమోదు చేస్తున్న సూర్యనారాయణ తదితరులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదులో వేగం పెంచి లక్ష్యాలను నేతలు, కార్యకర్తలు పూర్తి చేయాలని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జ్ నల్లూరు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం వార్డులోని రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీలో ఆయన ఆధ్వర్యంలో సభ్యత్వనమోదును చేపట్టారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వేగుంట శ్రీనివాస్, నాగార్జున, వెంకట సుబ్బయ్య, జగదీష్, రాధ, బొబ్బిలి శ్రీను, వేంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్‌లో సమస్యలను పరిష్కరిస్తా : పల్లా



పల్లాకు సన్మానిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు

గాజువాక , డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కబడ్డీ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో జరిగిన కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావును జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత అసోసియేషన్‌పై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టి పటిష్టమైన కబడ్డీ అసోసియేషన్ ఏర్పాటుచేసి క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఇస్తానన్నారు. గాజువాకలో ఇండోర్ కబడ్డీ స్టేడియం ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా అసోసియేషన్ నాయకులు ఉరుకూటి బాబూరావు, పి.కోటేశ్వరరావు, ఎం.గణపతి, పల్లా రమణ, వి.అచ్చిలనాయుడు, వి.చిన బాబూరావు, ప్రసాదుల శ్రీనివాస్, పి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



ఆర్థిక సహాయం చేస్తున్న శిష్టకరణాల అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని శిష్టకరణాల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ సభ్యుల సమావేశం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అతి త్వరలోనే శిష్టకరణాలకు ఓబీసీ సాధ్యపడుతుందన్నారు. విద్య, వైద్యానికి కూర్మన్నపాలెం శాఖ తీసుకుంటున్న చర్యలు ఇతర శాఖలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉమామహేశ్వరరావు, మంత్రి శ్యామ్‌ప్రసాద్, డి.ఆదినారాయణ, బీటీ జగదీష్, మంత్రి నరసింహమూర్తి, డి.సత్యారావు, గంగవరం గోపి, గురునాథరావు, రవీంద్రబాబు, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, శివాజీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పల్లాకు వినతి

అగనంపూడి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పూడివానిపాలెంలో గల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వార్డు జనసేన అధ్యక్షుడు గవర సోమశేఖర్ ఆధ్వర్యంలో పలువురు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గల సమస్యలను ఆయనకు వివరించారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జనసేన నేతలు పామల వసంతరావు, కోమటి కనకరాజు, బొద్దపు మాణిక్యం, మంత్రి శ్రీనివాసరావు, బాలాజీ, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఏఎన్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కరణం నరసింగరావు

గాజువాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురికి ప్రాణదానం చేసిన వారవుతామని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక ఏఎన్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదానంపై అపోహలు విడనాడాలన్నారు. సమయానికి రక్తం అందకపోవడం వల్ల ఏ ఒక్కరూ మృతిచెందకూడదని, ఈ సంకల్పంతో రక్తదానం చేయటానికి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా మూడు వందల యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు వినోద్‌బాలు, శంకరరావు, నాగేశ్వరరావు, రంజిత్, రాహుల్ పాల్గొన్నారు.

రహదారి విస్తరణ ప్రతిపాదనపై ఆందోళన



ఆందోళన చేస్తున్న చీమలాపల్లి గ్రామస్తులు

పెందుర్తిరూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేపగుంట-పినగాడి ప్రధాన రహదారిని 150 అడుగులు విస్తరించడానికి వీఎంఆర్డీఏ ప్రతిపాదించడం పట్ల గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లి గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. విస్తరణ పరిధిని తగ్గించాలని కోరుతూ నినదించారు. నిరసనకారుల నుంచి సంతకాలు సేకరించారు. కార్యక్రమానికి సారథ్యం వహించిన టీడీపీ సీనియర్ నాయకుడు అయితా ఎర్నిబాబు మాట్లాడుతూ చీమలాపల్లిలో రహదారికి రెండు వైపులా ప్రభుత్వం మంజూరు చేసిన హౌసింగ్ రుణాలతోనే గ్రామంలోని పేదలు ఇళ్లు కట్టుకున్నారని, ఇపుడు రహదారి విస్తరణపై వీఎంఆర్డీఏ తాజాగా చేసిన ప్రతిపాదన ఆచరణ రూపం దాల్చితే పేదల ఇళ్లను పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. వీరితో పాటు రూ.లక్షలు వెచ్చించి దుకాణ సముదాయాలు నిర్మించుకునవారు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. విస్తరణపై పునరాలోచించాలని కోరుతూ సోమవారం కలెక్టరు, జీవీఎంసీ కమిషనరు, జోనల్ కమిషనరు, వీఎంఆర్డీఏ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ల వద్దకు సామూహికంగా వెళ్లి వినతిపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు.

ఎట్టకేలకు రహదారి నిర్మాణం ప్రారంభం



కొత్తపాలెం శివారులో రహదారి పనులు చేపడుతున్న దృశ్యం

గోపాలపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరదనీటి ముంపు కారణంగా దుర్భరంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టడానికి ఎట్టకేలకు చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ పరిధి 89వ వార్డు కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారిలో కొత్తపాలెం గ్రామ శివారు వద్ద తరచూ కోతకు గురవుతోంది. దీంతో గుంతలు పడిన రహదారిపై రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రాకపోకలు నిలిచిపోయి వేలాది మంది ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు, నేతలు ఈ ప్రాంతంలో పర్యటించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత వారం రోజుల నుంచి రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రహదారి కోతకు గురికాకుండా ఇరువైపులా రక్షణ గోడ నిర్మిస్తున్నారు. రహదారి పనులు ప్రారంభించడంతో తమ ఇబ్బందులు తీరుతాయని పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు ప్రజల హృదయ విజేత ఎన్టీఆర్



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద అభిమానుల నివాళి

ఎన్.ఎ.డి.జంక్షన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు ఎన్.ఎ.డి.లోని ఓ హోటల్‌లో ఎన్టీఆర్ అభిమానులు ఆయన సినీ వజ్రోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల చిన్న అప్పారావు పాల్గొని కేకు కోశారు. ఎన్టీఆర్ తన నటన ద్వారా ఎంతోమంది హృదయాలను చూరగొన్నారని కొనియాడారు. ప్రజా సమస్యలనే ఇతివృత్తాలుగా తీసుకొని సినిమా మాధ్యమం ద్వారా వాటిని ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి భీశెట్టి రవీంద్ర, ప్రసన్న, హుస్సేన్, గణేష్, వెంకట్రావు, శేఖర్, షాలిని, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశయన వర్గీయులకు పంచకర్ల హామీ



ఎమ్మెల్యే పంచకర్లను స్వాగతిస్తున్న శ్రీశయన సభ్యులు

పెందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి శ్రీశయన సంఘ సమావేశం ఆదివారం సింహాచలంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంతశంకర్రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ ఈ సామాజిక వర్గీయుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ చైర్మన్ కిల్లి గోపాల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూర్తి చంద్రభూషణరావు, బమ్మిడి రమణ, గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

పెందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతగట్లకు చెందిన సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరారు. సుజాతనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు హాజరై జనసేనలో చేరినవారికి ఆ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మడిశ హరీశ్, బట్ట అప్పలరాజు, నందవరపు కనకరాజు, మనాస శివ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26,వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 22, క్యారెట్ 56 దొండకాయలు 36, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీర దోస 28,కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 52, కొండ ఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

- అన్ని సీఎఫ్ఎస్‌ల వద్ద నిఘా
- జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి భాస్కరరావు
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో పోర్టుల నుంచి రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతి కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి భాస్కరరావు శనివారం తెలిపారు. 'రేషన్ బియ్యానికి రెక్కలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శనివారం ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు చేసిన వెళ్లిన తరువాత తాము ఎగుమతి కోసం వస్తున్న బియ్యాన్ని పరిశీలించి, అవి రేషన్ బియ్యం అయితే సీజ్ చేస్తున్నామని చెప్పారు. ఈ విధంగా బెబో ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన బియ్యాన్ని ఈ నెల 9వ తేదీన 271 టన్నులు, 10వ తేదీన 203 టన్నులు, 11వ తేదీన 56 టన్నులు..మొత్తం 530 టన్నులు సీజ్ చేశామన్నారు. అయితే విశాఖ కంటెయినర్ టెర్మినల్-సీఎఫ్ఎస్ వద్ద మాత్రమే నిఘా ఉంచడం వల్ల కొంతమంది ఇతర సీఎఫ్ఎస్‌లను ఆశ్రయిస్తున్నట్టు తెలిలియడంతో శనివారం పెదగంట్యాడలోని సీఎఫ్ఎస్, శ్రవణ్ సీఎఫ్ఎస్ గోదాములను ఆకస్మిక తనిఖీ చేశామని చెప్పారు. మిగిలిన సీఎఫ్ఎస్‌లు, గోదాములపై కూడా నిఘా ఉంచామన్నారు. ఎవరైనా రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

150 మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు

మల్కాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్), శంకర్ నేత్రాలయ ఫౌండేషన్ సహకారంతో విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెదమేడపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఉచిత కంటి ఆస్పత్రి శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని షిప్‌యార్డు డైరెక్టర్ సీఎండీ రాకేష్ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ అప్పలనాయుడు, షిప్‌యార్డు అధికారులు రాధాకృష్ణన్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సింహాద్రి 4వ యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీపీసీ సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి శనివారం అర్ధరాత్రి అంతరాయం ఏర్పడింది.

యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు.

కాగా వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌ను గత నెలలో షట్‌డౌన్ చేశారు. ప్రస్తుతం ప్లాంట్‌లో ఒకటి, మూడు యూనిట్లలో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతునట్టు అధికారులు వెల్లడించారు. దీనివల్ల కొంత ఇబ్బందులు ఎదురైనట్టు చెప్పారు.

సామాజిక సేవకు పూర్వ విద్యార్థుల నిర్ణయం



సమావేశమైన నాటి షిప్‌యార్డు విద్యార్థులు

మల్కాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆనాటి ఆ స్నేహమానంద గీతం ..ఆనాటి జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం.. అనే పాటను గుర్తు చేసుకుంటూ మల్కాపురం మున్సిపల్ హైస్కూల్, షిప్‌యార్డు పాఠశాల విద్యార్థులు వేర్వేరుగా సందడి చేశారు. మల్కాపురం ఎంసీహెచ్ స్కూల్ విద్యార్థులు యారాడలో కలిసి ఆనందం పంచుకున్నారు. 2025లో స్నేహితుల దినోత్సవం రోజు నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. షిప్‌యార్డు 1984-1985 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు నగరంలోని మేఘాలయ హోటల్‌లో కలిసి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి దుబాయి, సింగపూర్, కతార్, మలేషియా, కర్ణాటక, హైదరాబాద్, రాజమండ్రి, వివిధ జిల్లాల నుంచి రెండురోజులు ముందుగానే విశాఖకు చేరుకున్నారు. ఆదివారం జరిగిన 'మీట్ ది ఓల్డ్ ఫ్రెండ్స్' కార్యక్రమంలో పాల్గొని ఆనందం పంచుకున్నారు. వీరందరినీ ఓ వేదికపై తీసుకొని రావడంలో గంజి శ్రీను, సింగ్, అరుగుల శ్రీను, సుజి మహరానా, బచ్చానా, వెంపరాల శ్రీను, సుధాకర్, శివలు ప్రత్యేకంగా కృషి చేశారు.

ఘనంగా దుర్గాదేవి అంబలం పూజ



నూకాంబిక ఆలయ ఆవరణలో భక్తుల పూజ

వేపగుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు పరిధి వేపగుంట దరి గంగిరెడ్డికాలనీలో కొలువైన నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో దుర్గాదేవి అంబలం పూజను మాలధారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, పూలతో అలంకరణ, దుర్గా సహస్ర పారాయణం, భక్తిపాటలు ఆలపించారు. రమణ గురుస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భవాని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసన



బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు,ట్రూ అప్ చార్జీలు,స్మార్ట్ మీటర్లను నిరిసిస్తు కంచరపాలెం జోన్ సీపీఎం నాయకులు ఆదివారం నిరసనలు వ్యక్తం చేశారు.జీవీఎంసీ 55వార్డు పరిధి రెడ్డికంచరపాలెంలో స్థానికులుతో కలిసి విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు.ఈసందర్భంగా జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై విపరీతమైన భారాలు మోపడం జరుగుతుందన్నారు.నిత్యావసర వస్తువులు ధరలు,వివిధ పన్నులు పెరుగుదలతో పాటు వివిధ చార్జీలు పేరుతో విద్యుత్ ధరలను పెంచడం దుర్మార్గమన్నారు.తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకుంటే సీపీఎం పోరాటం మరింత ఉధృతం చేస్తుందన్నారు.కార్యక్రమంలో ఒ.విజయ,కె.కొండమ్మ,లక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

నేర సంఘటనలపై ఫిర్యాదు చేయండి

జగదాంబ కూడలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేర సంఘటనలపై ఫిర్యాదు చేయాలని వన్‌టౌన్ సీఐ జె.డి.బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఘోషా ఆసుపత్రి సమీపంలో 'మీ కోసం-పోలీస్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు పోలీసులతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కేధారి లక్ష్మి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గీత దాటితే కఠిన చర్య



రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్

సీతమ్మధార, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క రౌడీషీటర్ సత్ప్రవర్తనతో మెలగాలని, అదే విధంగా అసాంఘిక కార్యకలాపాలకు, గొడవలకు దూరంగా ఉండాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావు సూచించారు. గీత దాటిన వారికి చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి ఎస్ఐ వెంకటరావు వ్యక్తిగతంగా పలు సూచనలు చేశారు.

సీతమ్మధార రైతు బజారులో చిల్లర నాణాలు పంపిణీ



నాణాలు పంపిణీ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిల్లర నాణాల కొరతను దృష్టిలో పెట్టుకుని కనక మహలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో సీతమ్మధార రైతు బజారులో చిల్లర నాణాల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. స్థానిక రైతు బజారులోని రైతులకు వినియోగదారులకు 3.50లక్షల రూపాయలు విలువైన 1 రూపాయి నుంచి 20 రూపాయల వరకు గల అన్ని చిల్లర నాణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంలో చిల్లర నాణాలు పంపిణీ చేశామని వివరించారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ ఆఫీసరు, బ్రాంచి మేనేజరు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

సీతమ్మధార, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార గాంధీనగర్‌లో డాక్టర్ రహమ్‌తుల్లా క్లినిక్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మంది పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ రహమ్‌తుల్లా, డాక్టర్ కుమారిలు వైద్య సేవలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, జి.మురళీకృష్ణ, వి.విశ్వనాథం, సీహెచ్ నారాయణమూర్తి తదితరులు సహకరించారు.

కరాటే చాంపియన్ షిప్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండో వైజాగ్ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌ను పోర్టు స్టేడియంలో ఆదివారం బీజేపీ రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, సుజయ్ బయోటెక్ చీఫ్ సైంటిస్ట్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేటి కాశీవిశ్వనాథ్, కేఎన్ఆర్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కంచరాన సూర్యనారాయణ, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ చిగురుపల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి

కనకమహాలక్ష్మి ఆలయ ఈవోకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశం.. పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కనకమహాలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న దేవదాయశాఖ అధికారులు

జగదాంబ కూడలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కనకమహాలక్ష్మి ఆలయ ఈవో శోభారాణిని ఆదేశించారు. మార్గశిర ఉత్సవాల సందర్భంగా మంత్రి అమ్మవారి ఆలయాన్ని ఆదివారం సందర్శించగా అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద పండితులు మంత్రి చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఈవో కె.శోభారాణి భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను మంత్రికి వివరించగా సంతృప్తి వ్యక్తం చేశారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం మంత్రికి దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో శోభారాణిలు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథ్, విశాఖ దేవదాయశాఖ ఉపకమిషనర్ ఎన్.సుజాత, టీడీపీ దక్షిణ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి రాక సందర్భంగా వన్‌టౌన్ పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. సీఐ దేముడుబాబు మంత్రి కాన్వాయ్ ప్రవేశంతో పోలీసుల వలయం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

పంచ గ్రామాల భూ సమస్యకు త్వరలో పరిష్కారం

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ సమస్యకు కోర్టు అనుమతితో త్వరలోనే పరిష్కారం లభించనుందని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన అప్పన్న స్వామిని దర్శించుకున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నగరానికి చెందిన కూటమి ఎమ్మెల్యేలు ఈ సమస్య ప్రస్తావించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అశోక్‌గజపతిరాజుతో సమావేశమైనట్టు తెలిపారు. దేవాలయాల్లో వైదిక సంప్రదాయాలు కొనసాగించేందుకు అవసరమైన ఖాళీల భర్తీకి కార్యాచరణ రూపొందిస్తున్నామని, వేద అధ్యయనం చేసిన వారితో నియామకాలు చేపట్టడంతో పాటు, కైంకర్యపరులు, ఇతర లౌకిక పోస్టుల భర్తీని సీఎం ఆదేశాలతో ప్రకటిస్తామన్నారు. మంత్రికి ఆలయ ఆచారం ప్రకారం ఈఓ వేంద్ర త్రినాథరావు తదితరులు పూర్ణ కుంభంతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత ఆలయ పండితులు చతుర్వేద ఆశీస్సులీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

సాగర తీరంలో ఉత్సాహంగా నేవీ మారథాన్



ఆర్‌కే బీచ్ రోడ్డులో ఉత్సాహంతో యువతీ యువకుల నృత్యం



విజయానందంలో మారథాన్ విజేత

మహారాణిపేట (విశాఖపట్నం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో నేవీ మారథాన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. విశాఖ బీచ్‌లో తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన 9వ నేవీ మారథాన్‌ను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, తూర్పు నావికాదళ ప్రధాన అధికారి రాజేష్ పెధకర్, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిలు జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌కే బీచ్‌లోని విష్ణుప్రియా ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభించిన మారథాన్‌లో దేశ, విదేశీయులు సుమారు 15 వేల మంది పాల్గొన్నారు. 42 కె, 21 కె, 10 కె, 5 కె లక్ష్యంగా యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పరుగు తీశారు. తెల్లవారు జామున సుమారు 4 గంటలకు 42 కె మారథాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద మారథాన్ విశాఖలో నిర్వహించటం శుభపరిణామమని, దీనివల్ల విశాఖలో ఉన్న పర్యాటక ప్రదేశాలు, సముద్రతీరం సహా అనేకం పర్యాటకాభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. సుమారు 8 దేశాలకు చెందిన రన్నర్సు పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ నావల్ కమాండర్ రాజేష్, సమీర్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, పలువురు యువతీ యువకులు, నేవీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

దసపల్లాలో మిశాఖీ పాన్ ఏసియన్ రెస్టారెంట్ ప్రారంభం



నోరూరించే కొత్త రుచులు

మహారాణిపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హోటల్ దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టులో మిశాఖి పేరుతో పాన్ ఏసియన్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. దసపల్లా హోటల్ అధినేత రాఘవేంద్రరావు ఆదివారం దీన్ని ప్రారంభించారు. అనేక సంవత్సరాలుగా దేశంలోని ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల రుచులను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువత రుచులకు అనుగుణంగా జపనీస్, థాయ్, చైనీస్, ఇండోనేషియా, వియత్నాం తదితర దేశాల రుచులను అందించేందుకు నూతనంగా దీన్ని ప్రారంభించారు. మిశాఖీలో లభించే వంటకాలు పాన్ ఏషియన్ వంటకాలు క్రిస్పి చికెన్‌బౌ, కెఫర్ లైమ్ చికెన్, జపనీస్‌కు చెందిన షుషి, కాలిఫోర్నియా రోల్, కోకోనట్ ప్రాన్ సూప్, చికెన్ అండ్ స్వీట్ కార్న్, డిమ్‌సమ్ చికెన్ బావ్‌బాన్ టోఫూ, వెజ్ అండ్ నాన్‌వెజ్ ఫ్రైడ్ గార్లిక్ రైస్ డెజర్టు కోకోనట్ అండ్ జగరీ ఐస్ క్రీమ్, టబ్‌టిమ్ గ్రాబ్ సహా వివిధ రకాల రుచులతో కూడిన వంటకాలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

నేషనల్ రోలర్ స్కేటింగ్‌లో ట్విన్స్‌కు బంగారు పతకాలు



పతకాలు చూపుతున్న హనీష్, హవీషలు

మహారాణిపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జరిగిన 62వ రోలర్ స్కేటింగ్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన హనీష్, హవీష్‌లు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ట్విన్స్ పితాని హనీష్, హవీష్‌లు 11, 14 ఏళ్ల కేటగిరీలో ఈ ఘనత పొందారు. ఈ సందర్భంగా వారు తమ వ్యక్తిగత ప్రతిభతో పాటు మన దేశ రోలర్ స్కేటింగ్ క్రీడ ప్రాధాన్యాన్ని పెంచారని కోచ్‌లు చిట్టిబాబు, పి.సత్యనారాయణలు తెలిపారు.

ఘంటసాల గీతాలకు అందరి మదిలో సుస్థిర స్థానం



నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని సన్మానిస్తున్న కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల గీతాలు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఆదివారం రాత్రి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల గానోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గాయకులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు నేతృత్వం వహించిన ఈ కార్యక్రమంలో పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, గౌరవ అధ్యక్షులు కొణతాలరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత జరిగిన విభావరిలో బంగ్రారాజు, భాగ్యలక్ష్మీ, ప్రకాష్, జ్యోతి, విశ్వప్రసాద్, కోమలి గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు అలరించాయి. సోమేశ్ సంగీత సారథ్యంలో జరిగిన విభావరికి మధుపాడ రమణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

లక్ష్యసాధనకు కృషిచేయాలి

డాబాగార్డెన్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి కోరారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆర్క్‌వ్యాలీ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఫిల్మ్ డైరెక్టర్ శుభశ్రీ ముఖర్జీ మాట్లాడుతూ బాల్య జీవితం మరుపురాని రోజులని అభివర్ణించారు. ప్రిన్సిపాల్ ఎం.సాయిలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో ఏటా వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బేబీ కిట్లు వచ్చేస్తున్నాయ్..

... 5వ పేజీ తరువాయి

అరకొరగా అమలు చేసినా.. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ఈ పథకానికి తిలోదకాలిచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో మళ్లీ ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే జిల్లాల వారీగా నెలవారీ అయ్యే ప్రసవాలు, అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయ్యే ప్రసవాలు వంటి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల నుంచి తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే గర్భిణులకు మాత్రమే ఈ కిట్లను అందించనున్నారు.

కిట్‌లో ఉండే వస్తువులు

కిట్‌లో సుమారు వెయ్యి రూపాయలకు పైగా విలువైన కొన్ని వస్తువులు ఉంటాయి. మస్కిటో నెట్, శానిటైజర్, బేబీ బెడ్ కమ్ క్యారియర్, కొన్ని రకాల క్రీములు, పౌడర్ వంటివి ఉంటాయి. ఇవి బయట కొనుగోలు చేస్తే కనీసం రెండు వేల రూపాయల వరకు ఉంటుంది. ప్రభుత్వం వీటిని బల్క్‌గా కొనుగోలు చేసి ఉచితంగా అందించనున్నది. కొద్దిరోజుల్లోనే దీనిని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల నిరుపేదలకు ఎంతో మేలు చేకూరుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, ఏజెన్సీలోని ఆస్పత్రులు, కేజీహెచ్, ఘోషా వంటి ఆస్పత్రుల్లో ప్రసవించే గర్భిణుల్లో చాలామంది వీటిని కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతుంటారు. కనీస అవసరాలైన వీటిని అందించకపోవడం వల్ల చిన్నారులు కొన్ని రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారని ప్రభుత్వం భావిస్తోంది. అటువంటి వాటికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ కిట్‌లో మరికొన్ని వస్తువులను పెట్టే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

మహారాణిపేట/సీతంపేట డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహనీయుడని డీఆర్‌వో భవానీశంకర్ శ్లాఘించారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు కమిషనరేట్‌లో ఏడీసీపీ డాక్టర్ వి.జి. రాజ్‌కమల్ అధికారులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు మాట్లాడేవారందరికీ భాష ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని జనసేన నాయకులు పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు గుండు సురేష్ బాబు, జనసేన మహిళా కో-ఆర్డినేటర్ అమరాపు దుర్గ, నారా నాగేశ్వరరావు తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ అధికారులతో మంత్రి ఆనం సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆ శాఖ అధికారులతో నగరంలోని తాజ్ హోటల్‌లో ఆదివారం సమావేశమై కీలక అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా సింహాచలం, మాన్సాస్ ట్రస్టు భూములకు సంబంధించిన సమస్యలు, పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి గల ఇబ్బందులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇతర దేవాలయాల నిర్వహణపైనా చర్చించారు. సమావేశంలో సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో అశోక్‌గజపతిరాజు మాట్లాడారు. సింహాచలం, మాన్సాస్ భూముల సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే రుషికొండ భవన నిర్మాణాలు చేపట్టారని, ఇదొక పిచ్చిపనిగా అభివర్ణించారు. రుషికొండ భవనాలను మానసిక ఆస్పత్రిగా మార్చితే మంచిదని వ్యాఖ్యానించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనంతా సైకో పాలనగా సాగిందని విమర్శించారు. ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టే అధికారం ఎవరిచ్చారని అశోక్‌గజపతిరాజు ప్రశ్నించారు.

ఏయూకు అడ్వయిజరీ బోర్డు?

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. వీరిలో ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అటువంటి వారిని వర్సిటీకి కనెక్ట్ చేయడంతోపాటు అభివృద్ధికి వారి సహకారాన్ని తీసుకోవాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. పూర్వ విద్యార్థుల సహకారంతో వర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో నిల బెట్టేందుకు ఈ అడ్వయిజరీ బోర్డును ఏర్పాటుచేస్తారని చెబుతున్నారు. ఈ బోర్డులో పూర్వ విద్యార్థులు, ఉన్నత విద్యా శాఖకు చెందిన అధికారులు, ఏయూ అధికారులు ఉండవచ్చునని భావిస్తున్నారు. వర్సిటీకి సంబంధించిన కీలక నిర్ణయాలు ఈ బోర్డులో తీసుకునే వెసులుబాటు కల్పిస్తారంటున్నారు. దీనిపై స్పష్టత రావడానికి కొంత సమయం పడుతుందని చెబుతున్నారు. ఏదిఏమైనా అడ్వయిజరీ బోర్డు గురించి స్వయంగా మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రే ప్రస్తావించడంతో ఈ విషయంపై ప్రస్తుతం వర్సిటీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

కీలక ప్రకటనపై ఆసక్తి

ఇదే సమావేశంలో మంత్రి మరో కీలకమైన వ్యాఖ్య చేశారు. కొద్దిరోజుల్లోనే వర్సిటీ సంబంధించి ముఖ్యమైన ప్రకటన వెలువడుతుందని వెల్లడించారు. అది ఏమై ఉంటుందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ వంటి అంశాలను ప్రస్తావించిన మంత్రి నారా లోకేష్..ఆ వెంటనే కీలక ప్రకటన త్వరలో వెలువడుతుందన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద విశ్వవిద్యాలయం కావడంతో ఏయూకు మంత్రి నారా లోకేశ్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఉపయోగపడే ప్రకటన రావచ్చునన్న ఆశాభావాన్ని వర్సిటీ వర్గాలు వ్యక్తం చేస్తు న్నాయి. 'ఆ హబ్' పేరుతో ఇప్పటికే స్టార్టప్ సెంటర్, మరికొన్ని ఇంక్యుబేషన్ సెంటర్లు ఏయూలో ఉన్నాయి. ఈ తరహాలో మెగా సెంటర్ ఒకటి ఏర్పాటుచేసే ఆలోచనలో మంత్రి ఉన్నారని, దీనిని రాష్ట్రంలోని అన్ని సెంటర్లకు కేంద్రంగా ఏయూలో పెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు ఉద్వాసన

... 5వ పేజీ తరువాయి

వెలువరించింది. మంత్రివర్గ ఉప సంఘం మానవతా దృక్పథంతో ఉద్యోగాల్లోకి తీసుకున్న వారిని తొలగించాలంటూ సూచించింది. దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఆదేశాలను రాత్రికి రాత్రే అమలు చేసేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,200 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో పని చేస్తున్న 170 మంది ఉద్యోగాలను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో వారంతా తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలను కలిసి తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని కోరుతున్నారు. అప్పట్లో విధుల్లో చేరిన 1,200 మందిలో 220 మంది మాత్రమే మెరిట్‌లో లేకున్నా ఉద్యోగాలు పొందారని, మిగిలిన వారంతా నిబంధనల ప్రకారం విధుల్లో చేరారని పేర్కొంటున్నారు. 20 ఏళ్లుగా.. మరీ ముఖ్యంగా కరోనా వంటి విపత్కర సమయంలోనూ క్షేత్రస్థాయిలో పనిచేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడామని వారు పేర్కొంటున్నారు. కరోనా సమయంలో ఎంతోమంది కుటుంబ సభ్యులను కోల్పోయామని, ఇప్పుడు తమను ఉద్యోగాల నుంచి తొలగించి రోడ్డున పడేశారని వాపోతున్నారు.

ఈ సందర్భంగా ఉద్యోగం కోల్పోయిన శ్రీనివాస్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో విధుల్లోకి వెళ్లి, రావడం వల్ల వైరస్ బారినపడి కుటుంబ సభ్యులకు వ్యాప్తి చెందేందుకు కారణమయ్యాయని, ఆ సమయంలో తన భార్యతో పాటు అత్తామామలను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం వల్ల తాను కుటుంబాన్నే నష్టపోయానని, ఇప్పుడు ఉద్యోగం కూడా కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విచార వదనంతో తెలిపారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆలోచించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇలాంటి పరిస్థితినే ఎంతోమంది ఎదుర్కొంటున్నారని, వారంతా ప్రభుత్వ పెద్దల చుట్టూ తమను ఆదుకోవాలంటూ తిరుగుతున్నారన్నారు. మరి వీరిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

నగరంలో వనం

... 5వ పేజీ తరువాయి

మొత్తం ఆనందంగా గడిపేలా చెట్ల కింద రచ్చబండలు, భూమికి ఐదారు అడుగుల ఎత్తులో వుడెన్ మంచాలు, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్, కాటేజీలు ఏర్పాటు చేస్తారు. కంబాలకొండలో ట్రెక్కింగ్ చేస్తున్న ప్రాంతంలో నగర వనం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఉదయం పూట వాకింగ్, సైక్లింగ్ చేసుకునేవారికి అనువుగా సదుపాయాలు కల్పిస్తారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లా కేంద్రాల్లో నగర వనాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. సాగర్‌నగర్ తీరానికి ఆనుకుని సరుగుడు మొక్కలతో షెల్టర్ బెల్ట్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో కూడా నగర వనం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. దీనిపై సర్వే చేసిన తరువాత నివేదిక రూపొందించనున్నారు.

మాజీ ఎంపీ ఎంవీవీ దందా

... 5వ పేజీ తరువాయి

దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారుల వివరణ తీసుకోవడంతో పాటు పిటిషనర్‌ను, నిర్మాణ సంస్థను పిలిచి విచారించాలంటూ జీవీఎంసీ అధికారులకు హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చినగదిలి తహసీల్దార్‌తో పాటు పిటిషనర్‌ను, నిర్మాణసంస్థను రెండు నెలలు కిందట జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తన సమక్షంలో విచారణ జరిపారు. నిర్మాణం జరుగుతున్న స్థలం మధురవాడ సర్వే నంబర్-2లోని పట్టా నంబర్-585లో ఉన్నట్టు డిప్యూటీ తహసీల్దార్ నిర్ధారించారు. దీంతో ఈ నిర్మాణం అక్రమమని తేలడంతో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ అధికారులు దృష్టిసారించారు.

అధికారానికి దాసోహమైన టౌన్ ప్లానింగ్ అధికారులు!

ఎవరైనా భవన నిర్మాణానికి దరఖాస్తు చేస్తే దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో పొందుపరిచిన పత్రాలను పోస్ట్ వెరిఫికేషన్‌లో భాగంగా టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తారు. ఒకవేళ ప్రభుత్వ భూములను ఆనుకుని ఉన్న స్థలాలు, మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ప్రాంతంలోని స్థలాలు, నాలా కట్టని భూమిలో భారీ నిర్మాణాలు చేపట్టినట్టయితే టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ స్థలంపై సర్వేయర్ రిమార్క్ తీసుకున్న తర్వాతే ప్లాన్ జారీపై నిర్ణయం తీసుకుంటారు. అయితే మాజీ ఎంపీ భవన నిర్మాణం విషయంలో ఒక పట్టా నంబర్‌ను చూపించి మరో పట్టా నంబర్‌లోని స్థలంలో నిర్మాణం జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు కళ్లు మూసుకుని అనుమతులు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పట్టా నంబర్‌లో అనుమతి తీసుకుని వేరొకచోట అపార్టుమెంట్ నిర్మించేస్తున్నారని ఫిర్యాదు అందినప్పుడైనా సదరు అధికారులు కనీసం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పుడు హైకోర్టు ఆదేశంతో జీవీఎంసీ కమిషనర్ సమక్షంలో జరిగిన విచారణలో ఆ నిర్మాణం అక్రమమని నిర్ధారణ కావడంతో ఆ అపార్టుమెంట్‌కు ప్లాన్ జారీ చేసిన సమయంలోని సిబ్బంది, అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

యూపీ పాఠశాలలు ఎత్తివేత!

... 5వ పేజీ తరువాయి

ఆర్‌బీఎంయూపీ స్కూల్‌లో ఆరు, ఏడు తరగతుల పిల్లలు 194 మంది ఉన్నారు. 50 నుంచి 100 మంది ఉన్న పాఠశాలలు ఐదు, 31 నుంచి 49 మంది ఉన్న పాఠశాలలు ఆరు ఉన్నాయి. కాగా ఐదు నుంచి 30 మంది విద్యార్థులున్న స్కూళ్లు 16 ఉన్నాయి. 30 మంది కంటే తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఆరేడు తరగతులకు పాఠాలు బోధించే సబ్జెక్టు టీచర్లు లేరు. ఈ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయగా అక్కడ ఎస్జీటీలు బోధన చేస్తున్నారు. యూపీ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరడానికి విద్యార్థులు విముఖత చూపడానికి విద్యాశాఖ విధానాలే కారణమన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవస్థను కూనరిల్లేలా అధికారులు యూపీ పాఠశాలలకు తూట్లు పొడిచారు. సబ్జెక్టు టీచర్లను అందుబాటులోకి తీసుకురాకపోవడం, ఒకవేళ ఉన్నా ఒకటి లేదా రెండు సబ్జెక్టులకు పరిమితం చేస్తుండంతో పిల్లలను అక్కడ చేర్పించడానికి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్నప్పుడు వారిలో పోటీతత్వం ఉండదనే భావన వారిలో ఉంది. కాస్త స్తోమత ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు.

ఆరేడు తరగతుల విద్యార్థులు అతి తక్కువగా ఉన్న యూపీ పాఠశాలలు..

- పెదగంట్యాడ మండలం పిట్టవానిపాలెంలో ఆరో తరగతిలో కేవలం ఆరుగురు విద్యార్థులే ఉండగా ఏడోతరగతిలో ఒక్కరు కూడా లేరు. భీమునిపట్నం మండలం పెదనాగమయ్య పాలెంలో ఏడుగురు, కృష్ణంరాజుపేటలో 10 మంది, చిన్ననాగమయ్యపాలెంలో 11 మంది, ఆనందపురం మండలం దబ్బంద, వేములవలసల్లో 13 మంది చొప్పున ఉన్నారు.
- పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ, ఆనందపురంలోని పాలవలసలో రెండు తరగతులకు కలిపి 14 మంది వంతున ఉన్నారు. భీమిలిలోని మూలకుద్దులో 15 మంది, అన్నవరంతో పాటు పెందుర్తి పరిధిలోని పెదగాడిలో 16 మంది మాత్రమే ఉన్నారు.

☛ సంక్షిప్తంగా..

రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

» అన్ని సీఎఫ్‌ఎస్‌ల వద్ద నిఘా
» జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి భాస్కరరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో పోర్టుల నుంచి రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతి కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి భాస్కరరావు శనివారం తెలిపారు. 'రేషన్ బియ్యానికి రెక్కలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శనివారం ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు చేసిన వెళ్లిన తరువాత తాము ఎగుమతి కోసం వస్తున్న బియ్యాన్ని పరిశీలించి, అవి రేషన్ బియ్యం అయితే సీజ్ చేస్తున్నామని చెప్పారు. ఈ విధంగా బెబో ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన బియ్యాన్ని ఈ నెల 9వ తేదీన 271 టన్నులు, 10వ తేదీన 203 టన్నులు, 11వ తేదీన 56 టన్నులు...మొత్తం 530 టన్నులు సీజ్ చేశామన్నారు. అయితే విశాఖ కంటెయినర్ టెర్మినల్-సీఎఫ్‌ఎస్ వద్ద మాత్రమే నిఘా ఉంచడం వల్ల కొంతమంది ఇతర సీఎఫ్‌ఎస్‌లను ఆశ్రయిస్తున్నట్టు తెలిలియడంతో శనివారం పెదగంట్యాడలోని సీఎఫ్‌ఎస్, శ్రవణ్ సీఎఫ్‌ఎస్ గోదాములను ఆకస్మిక తనిఖీ చేశామని చెప్పారు. మిగిలిన సీఎఫ్‌ఎస్‌లు, గోదాములపై కూడా నిఘా ఉంచామన్నారు. ఎవరైనా రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అప్పన్న సన్నిధిలో ప్రైవేటు సంస్థ ప్రచారం బోర్డు



ఆలయ ఆవరణలో ఉన్న ప్రచార బోర్డు

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం అప్పన్న స్వామి ఆలయ పరిసరాల్లో వ్యక్తులు, సంస్థలకు సంబంధించి ఎటువంటి ప్రచార బోర్డులు ఏర్పాటు చేయరాదు. కానీ తాజాగా ఒక ప్రైవేటు సంస్థ స్వామివారి దర్శనం తరువాత గోదాదేవి ఆలయానికి వెళ్లే మలుపులో కంపెనీ పేరు పెద్దగా కనిపించేలా స్టాండ్ ఏర్పాటు చేసింది. దానికి అతి చేరువలో ఆలయ అధికారులు కూర్చుంటారు. దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్, ఈఓ ఆదివారం అదే మార్గంలో వెళ్లినప్పటికీ ఈ విషయాన్ని ప్రశ్నించకపోవడాన్ని భక్తులు ఆక్షేపిస్తున్నారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన శిరీష దంపతులు, తగరపువలసకు చెందిన కాళ్ల పురుషోత్తమ్ వేర్వేరుగా రూ. లక్ష చొప్పున విరాళాలు సమర్పించారు. విరాళాలను నగదు రూపంలో ఆలయ పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్)కు ఆదివారం వారు అందజేశారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 22, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 22, క్యారెట్ 56 దొండకాయలు 36, బంగాళ దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు రానున్నాయి

» పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్



పార్టీ నేతలతో సమావేశమైన శైలజానాథ్, పాల్గొన్న నారాయణరావు తదితరులు

సిరిపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు రానున్నాయని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త గమనిస్తూ ఉండాలని సూచించారు. ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చిన ఆయన ఆది సిరిపురంలోని కే లేవుట్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీఏ నారాయణ రావు నివాసంలో పార్టీ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు.

అనంతరం శైలజానాథ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైస్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైతే కాంగ్రెస్ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విషయంలో కాంగ్రెస్ ముందుంటుందన్నారు. కాంగ్రెస్ పూర్వ వైభవానికి అందరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉత్తరాంధ్ర మాజీ ఇన్‌చార్జ్ జీఏ నారాయణరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదం మహేష్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు డోలా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జమ్మూ ఆదినారాయణ, హైకోర్టు న్యాయవాది మూల లేపాక్షి, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు జగన్, మీసాల సుబ్బన్న, మూల వెంకటరావు, గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను నిర్లక్ష్యం చేయవద్దు

» విద్యార్థులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచన

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడల వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని, అందుకే వీటిని నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించిన తైక్వాండో విజేతలను ఆదివారం ఆయన కార్యాలయం వద్ద అభినందించారు. ఆరిలోవ బాబా తైక్వాండో అకాడెమీ విద్యార్థులు ఈ నెల 13న జరిగిన జిల్లా సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో వివిధ గ్రూపుల్లో పతకాలను సాధించారు.

ఈ సందర్భంగా బాబా ఆకాడెమీ విజేతల జాబితాను ఎమ్మెల్యే విడుదల చేశారు. బాలికల గ్రూప్ పూమ్సేలో నిహారిక, జాహ్నవి, జస్వితరాజ్ చైదరి స్వర్ణపతకాలు సాధించగా.., సహస్ర వల్లి, గౌసియా, విజయ రజత పతకాలు సాధించారు. మిక్స్ పూమ్సేలో గౌసియా, టూరజ్ అస్గర్ అలి కాంస్య పతకాలను సాధించారు. బాయ్స్ పూమ్సే విభాగంలో జయంత్, దినిక్, అక్షయ కార్తిక్ కాంస్య పతకాలు, వ్యక్తిగత బాలుర పూమ్ సే లో సషాంత్ కాంస్య పతకంతో పాటు క్యూరిగి అండర్ 36 విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఒవర్ వెయిట్ కేటగిరిలో జయంత్ రజత పతకం అదే కేటగిరీలో అక్షయ్ కార్తీక్ కాంస్య పతకం, క్యూరిగి అండర్ 42 విభాగంలో అషరఫ్ అలీ రజత పతకం, పెయిర్ పూమ్‌సే లో కాంస్య పతకం సాధించాడు. నవంబరులో ప్రకాశం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బాలికల పూమ్సేలో నిహారిక, జాహ్నవి, గౌసియ రజత పతకాలు, అదే కేటగిరీలో సహస్ర వల్లి, జస్వితరాజ్ చౌదరి, కుషి కాంస్య పతకాలు సాధించారు.

కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, 11వ వార్డు ఇన్‌చార్జ్ రాగతి అచ్యుతరావు, హెడ్ కోచ్ షేక్ అలి, కోచ్‌లు ఎండీ ఖ్వాజ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

» జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి



పొట్టి శ్రీరాములకు నివాళులు అర్పిస్తున్న ఏడీసీ రమణమూర్తి, జీవీఎంసీ అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో కలిసి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రధాన కారణమయ్యారన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు శ్రీరాములు అని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు, అమరజీవిగా ఖ్యాతినొందారన్నారు. కార్యక్రమంలో రెండవ జోనల్ కమిషనర్ ఎంవీడీ ఫణిరామ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.అప్పలనాయుడు, సహాయక ఇంజనీర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



అమరజీవికి నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, సభ్యులు

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు, గ్రంథాలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కళలు, సంస్కృతి వైవిధ్యభరితం

» మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

వెంకోజీపాలెం డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అత్యంత వైవిధ్యభరిత సంస్కృతులు, సంప్రదాయాలు భారతదేశానికి సొంతమని శాసనమండలి మాజీ సభ్యుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. వాటిని అనుసరిస్తూ భారతీయ శాస్త్రీయ, నృత్యాలకు ఆదరణ కల్పిస్తున్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ఉపకార్ చారిటబుల్ ట్రస్టు, ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ సంయుక్తంగా కోల్‌కతాకు చెందిన జాతీయ కథక్ డ్యాన్సర్ పాయల్ మల్లిక్‌ను యంగ్ ఇండియన్ క్వీన్ ఆఫ్ కథక్ పురస్కార్‌తో సత్కరించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాదవ్ హాజరయ్యారు. జీవీఎంసీ 15వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నృత్యానికి సరిహద్దులు లేవని, ప్రపంచంలో మరెక్కడా లేని అత్యంత వైవిధ్యభరిత సంస్కృతులు, సంప్రదాయాలు భారతదేశానికి సొంతమని వాఖ్యానించారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన ఉపకార్ చారిటబుల్ ట్రస్టు అధినేత, ఏపీ ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ కంచర్ల అచ్యుతరావుమాట్లాడుతూ భారతీయ కళలు, సంస్కృతులను పరిరక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లలు ఆ కళలను నేర్చేకునేలా ప్రోత్సాహించాలన్నారు. కళాకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తానన్నారు. బ్రహ్మకుమారీస్ రామేశ్వరి మాట్లాడుతూ భారతదేశంలో శాస్త్రీయ నృత్యం ఒక భాగమన్నారు. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ అధినేత నాగరాజు పట్నాయక్ సారథ్యంలో ఎంతో మంది చిన్నారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇచ్చారని, కొంతమంది చిన్నారులు రాష్ట్రపతి పురస్కారానికి కూడా ఎంపికయ్యారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొని కళాకారులకు సన్మానించారు.

అత్యున్నత అధ్యాపక విలువలకు తార్కాణం విశ్వేశ్వరరావు

» పలువురి నివాళి



విశ్వేశ్వరరావుకు నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

వెంకోజీపాలెం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : అత్యున్నత అధ్యాపక విలువలకు తార్కాణం, ఆంధ్రప్రదేశ్ ట్యూటరియల్ కాన్వెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, రోజరీ కాన్వెంట్ వ్యవస్థాపకుడు, కరస్పాండెంటు నెమ్మారు విశ్వేశ్వరరావు అని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల ఆయన స్వర్గస్తులైన కారణంగా బద్రి కాన్వెంట్ ఓల్డ్ స్టూడెంట్స్ అందరూ కూడా పాత వెంకోజీపాలెంలోని రోజరీ కాన్వెంట్ స్కూల్ ఆవరణలో ఆదివారం సాయంత్రం విశ్వేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విశ్వేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎంవీ రావు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి విశ్వేశ్వరరావు చేసిన సేవలు కొనియాడారు. రోజరీ కాన్వెంట్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రామస్వామి మాట్లాడుతూ పాఠశాల స్థాపించి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిపిన ఘనత విశ్వేశ్వరరావుకి దక్కుతుందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి మాట్లాడుతూ విశ్వేశ్వరరావు మాస్టారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీసీ ప్రతినిధులు చౌదరి, సత్యనారాయణ అధిక సంఖ్యలో స్కూల్ పూర్వ విద్యార్థులు, బాస్యం స్కూల్ మణికుమార్, వాగ్దేవి స్కూల్ సత్యనారాయణ, ప్రకాష్ స్కూల్ మురళి, సరస్వతి స్కూల్ శ్రీనివాస్, భారతి స్కూల్ మణికుమార్, శాంతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీసీటీఏ జోన్-1 కార్యదర్శిగా భగవాన్

మద్దిలపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) జోన్-1 కార్యదర్శిగా డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు ఎన్‌వీఎస్ భగవాన్ ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన జీసీటీఏ రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో జోనల్ కార్యదర్శిగా భగవాన్ ఎన్నికవ్వడంపై జిల్లా ప్రభుత్వ అధ్యాపకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ ఈ పదవి తనపై బాధ్యత పెంచిందని అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు.

శ్రీశయన కుల సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తాం

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శయన కులస్తుల సంక్షేమానికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. త్వరలోనే శయన కులస్తుల సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం కర్రి సన్యాసమ్మ మామిడితోటలో ఆ సంఘం వనభోజనాలు జరిగాయి. కార్యక్రమంలో 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, నాయకులు కిల్లి గోపాలం, పీసీహెచ్ భూషణరావు, బమ్మిడి రమణ, బెహరా శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

21వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

పెదవాల్తేరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పీతల అమరేంద్ర అధ్వర్యంలో ఆదివారం చినవాల్తేరులో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర పాల్గొని సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ పేతలు అవినాష్, మూర్తి, మాదీనా, చిన్ని దేవుడుబాబు, వీర్రాజు, వార్డు టీడీపీ సీనియర్ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

సింహాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్యతో ముడిపడడంతో అడివివరం గ్రామస్తులు కనీస హక్కులను కూడా కోల్పోయారని, తక్షణమే దేవదాయ శాఖాధికారులు 22ఏలో చేర్చిన గ్రామ కంఠం భూములకు పూర్వం మాదిరిగా హక్కులు కల్పించాలని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం కోరారు. ఆదివారం ఆయన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అం దించారు. ఈ సందర్భంగా పివి మాట్లాడుతూ దేవదాయ శాఖాధికారులు ఇతర నాలుగు గ్రామాల గ్రామ కంఠాలకు ఇచ్చిన మాదిరిగానే అడివివరం గ్రామకంఠం భూముల హక్కులను ప్రజలకు కల్పించాలని విన్నవిం చారు. ఆయనతో పాటు అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి సభ్యుడు కోరాడ ఈశ్వరరావు ఉన్నారు.

ఎన్‌టీపీసీ సింహాద్రి 4వ యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌టీపీసీ సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి శనివారం అర్ధరాత్రి అంతరాయం ఏర్పడింది. యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. కాగా వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌ను గత నెలలో షట్‌డౌన్ చేశారు. ప్రస్తుతం ప్లాంట్‌లో ఒకటి, మూడు యూనిట్లలో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతునట్టు అధికారులు వెల్లడించారు.

రాంబాబుకు ఉత్తమ రైతు పురస్కారం



రాంబాబుకు అవార్డు అందజేస్తున్న చిరంజీవి

మద్దిలపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఉత్తమ రైతు పురస్కారాన్ని ఆదివాసీ రైతు రాంబాబుకు ఏపీ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఆదివాసీ రైతుకు ఉత్తమ రైతు పురస్కారం అందించడం ఆనందంగా ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు దాట్ల వర్మ మాట్లాడుతూ చింతపల్లి మండలం రాజులబంద గ్రామానికి చెందిన పి.రాంబాబు అంతర పంటలు పండించే విషయంలో సిద్ధహస్తులు కావడంతో ఈ అవార్డును అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సిఫా సేవాసంస్థతో పలు దేశీయ విత్తనాలను తన పొలంలో పండిస్తు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి విభిన్న వ్యవసాయ పద్ధతులపై సలహాలు, సూచనలు చేస్తున్నారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి, వేదికపై మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు

భావి తరాలకు ప్రకృతి వనరులు అందించాలి

» ఏపీ ప్రిన్సిపాల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి

మద్దిలపాలెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంతరించుపోతున్న ప్రకృతి వనరులను భావి తరాల కోసం కాపాడుకోవాలల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఏపీ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చెప్పారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోని ఆర్గానిక్ మేళాలో ఆదివారం నిర్వహించిన మిద్దెతోటల పెంపకం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వనరులతో పండించిన సహజసిద్ధమైన పంటలతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. పట్టణాల్లో ఇంటి పైకప్పులు, ఆవరణలో కొద్ది పాటి స్థలంలో అయినా కూరగాయల మొక్కలు పండించుకోవచ్చని సూచించారు. చాలామంది మిద్దెతోటల వ్యవసాయం చేస్తూ రసాయనాలు లేని ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులు పండించే రైతులకు ఇలాంటి మేళాల వల్ల ఆదరణ లభిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ నగరంలో అధిక మొత్తంలో కూరగాయలు, ఆకుకూరలు పండించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రకృతి ఆధారిత పంటలు పండించడానికి చేయూత అవసరమన్నారు. ఏయూ మైదానంలో ఆర్గానిక్ మేళాను ఆదరించిన నగర వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సాధికారిత సంస్థ నిర్వాహకుడు బి.ప్రభాకర్ మాట్లాడుతూ మేళాలో రైతుల, ఆదివాసీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు మంచి ఆదరణ కలిగిందన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు, మిద్దెతోటల వ్యవసాయం చేసిన వారికి అవార్డులు అందించారు. కార్యక్రమంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ, అశోక్, ఉషాగజపతి తదితరులు పాల్గొన్నారు.

ఆచార వ్యవహారాలు మరిచిపోరాదు

» ఐదో గవర ప్రపంచ మహాసభలో పలువురు వక్తలు



ఎస్.కోట భవానీనగర్ సంఘానికి తులం బంగారం షీల్డ్‌ను అందజేస్తున్న గవర కుల ప్రముఖులు

సిరిపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవితంలోని మనమంతా ఎంత ఎత్తుకు ఎదిగినా.. .జన్మనిచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ ఆచార వ్యవహారాలను ఎన్నటికీ మరవరాదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఐదో గవర ప్రపంచ మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు, భగీరథ అవార్డు గ్రహీత తనకల నాగేశ్వరరావు, గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీఏ ఆడారి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు హాజరై జ్యోతి ప్రజల్వన గావించారు.

ఈ సందర్భంగా గవర జాతీయుల ఆచార వ్యవహారాల పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. కొన్నేళ్లుగా గవర జాతీయుల విద్య, ఆచార వ్యవహారాలు, ఇతరత్రా విషయాల్లోని నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు మూడు సంఘాలకు ప్రత్యేకంగా బంగారం షీల్డ్‌ను మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను బహూకరించారు. ఎస్.కోట భవానీనగర్ సంఘానికి ఒక తులం బంగారం షీల్డ్, విజయవాడ దాడి అప్పారావు సంఘానికి అర తులం బంగారం షీల్డ్, కణితి వద్ద సంఘానికి పావు తులం షీల్డ్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ సీఏ ఆడారి వెంకట రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఆచారవ్యవహారాలు గురించి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గవర జాతీయుల అభ్యున్నతికి కోసం నిరంతరం నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వారు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో విశాఖ, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లా, విజయవాడ, అనకాపల్లి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గవర కులస్థులు పాల్గొన్నారు.

కంబాల కొండలో వనసమారాధనల సందడి



పార్కులో ఆటపాటలతో సరదాగా గడుపుతున్న పిల్లలు

ఆరిలోవ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వన సమారాధనలతో కంబాలకొండలో ఆదివారం సందడ నెలకొంది. నగరంలోని వివిధ కుల, ఉద్యోగ, ఫోటో గ్రాఫర్ల సంఘాలు, పోలీసు, ఉపాధ్యాయుల సంఘాలు వనసమారాధనలు నిర్వహించారు. ఈ పార్కులో గల చెరువులో ఏర్పాటు చేసిన బోటు షికారులో సుమారు వంద మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ఆదివారం సుమారు 600 మంది కంబాలకొండను సందర్శించగా.. వీరి నుంచి సుమారు రూ.55 వేల ఆదాయం సమకూరినట్టు కంబాలకొండ సిబ్బంది తెలిపారు.

జూ పార్కు కిటకిట..

ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కిటకిట లాడింది. కార్తీక మాసం ముగిసినప్పటికీ వనసమారాధకుల సంఖ్య తగ్గకపోవడం విశేషం. సుమారు 6 వేల 2 వందల 72 మంది సందర్శకులు జూ పార్కు సందర్శించారు. వీరి నుంచి సుమారు రూ.4 లక్షల 90 వేల744 ఆదాయం సమకూరినట్టు జూ పార్కు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.